ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా పవన్‌కళ్యాణ్


డి.పవన్‌కళ్యాణ్

శంషాబాద్: ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్‌గా ముచ్చింతల్ గ్రామానికి చెందిన డి.పవన్‌కళ్యాణ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర అధ్యక్షుడితోపాటు మిగతా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని వినతి


డిప్యూటీ సీఎంకు కలిసిన నేతలు

శంషాబాద్: ఎస్సీ కార్పొరేషన్‌కు రూ. 6 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌తో పాటు జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు విజయ్‌కుమార్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం నగరంలో కలిసి విజ్ఞప్తి చేశారు. దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్ద పీట వేస్తున్న కారణంగా ఎస్సీ కార్పొరేషన్‌కు భారీ ఎత్తున నిధుల అవసరముందన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

వినాయక మండపాలకు అవార్డులు


అవార్డును అందుకున్న బెగోనియా గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు

మణికొండ: ఇటీవల నిర్వహించిన గణేశ్ నవ రాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మండపాలకు అవార్డులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మాదాపూర్‌లోని టీ హబ్ పిన్నాకిల్ ఆడిటోరియంలో అవార్డులను ఆయా మండపాల నిర్వాహకులకు అందజేశారు. అందులో భాగంగా సొసైటీ ఎక్సలెన్స్ అవార్డులను మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కు గణేష్ ఉత్సవ సమితి, బెగోనియా గేటెడ్ కమ్యూనిటీలకు అవార్డులు దక్కాయని నిర్వాహకులు తెలిపారు. అవార్డులను కన్వీనర్ డాక్టర్ సౌరభ్ సురేఖ అందజేయగా అలకాపూర్ టౌన్‌షిప్ గణేశ్ ఉత్సవ కమిటీ నాయకుడు వంశీ, బెగోనియా సొసైటీ కల్చరల్ కమిటీ సభ్యుడు జ్ఞానేశ్వర్, నాగ హరీష్, లక్ష్మీ నారాయణ, అరుణ్‌కుమార్ అందుకున్నారు.

పోకిరీలతో పరేషాన్..!

- పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు
- ఆందోళన చెందుతున్న చిన్నారులు, మహిళలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మందుబాబులు


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన మీరాలం చెరువు కట్ట, కాలనీలోని నిర్మానుష్య ప్రాంతం

శాస్త్రీపురం: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలోని నిర్మానుష ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మీరాలంచెరువు, వీరన్నకుంట, శాస్త్రీపురం, హసన్‌నగర్, ఎంఎంపహాడీ, చింతల్‌మెట్ ప్రాంతాలలో నిర్మానుష్య ప్రాంతాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. ఎప్పుడు పడితే అప్పుడు గుంపులుగా తిరగుతు ఖాళీస్థలాల్లో మద్యం సేవిస్తూ వచ్చిపోయేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతాలు, మీరాలంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు ఆవారా యువకులు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంపై గంతలో పోలీసులకు ఫిర్యాదులు చేసామని స్థానికులు తెలిపారు. పోలీసులకు చెప్పిన రెండు మూడు రోజులు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆ తరువాత మునుపటి పరిస్థితే నెలకొంటోందని వారు పేర్కొంటున్నారు. ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల నుంచి ఒంటరిగా ప్రయాణించాలంటే భయంగా ఉంటుందని ఆకతాయిల చేష్టల కారణంగా ఆయా ప్రాంతాల గుండా ప్రయాణం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒకచోట ఆకతాయిల కారణంగా గొడవలు జరగుతూనే ఉంటున్నాయి. ప్రశ్నిస్తే దాడులకు దిగుతుండటంతో భయంతో ఫిర్యాదు చేసేందుకూ భయపడుతున్నారు.

మీరాలంచెరువు వద్ద...

సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని సెట్విన్‌కాలనీకి ఆనుకొని ఉన్న మీరాంచెరువు పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు విచ్చల విడిగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సెట్విన్ పక్క నుంచి మీరలం చెరువు దగ్గరకు వెళ్లే రహదారి పక్కన రాత్రి వేళల్లో ప్రయాణించాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని... గంటల తరబడి రోడ్లపై విచ్చల విడిగా కలాపాలు సాగిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. చెరువు ఆనుకొని ఉన్న పొదలలో గంజాయి, మద్యం సేవిస్తూ నిత్యం కొందరు యువకులు ఇబ్బంది పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. నిర్మానుష్యంగా ఉండే ప్రాంతం కావడంతో ద్విచక్ర వాహనాలలో వచ్చి అక్కడే మకాం వేసి గ్రూపులు గ్రూపులుగా ఉంటున్నారని ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని దీంతో ఎవరూ వారి ఆగడాలకు అడ్డు చెప్పలేక పోతున్నారని పేర్కొంటున్నారు.



పోలీసుల గస్తీ పెంచాలి...

సంబంధిత పోలీసులు ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాలలో గస్తీని పెంచాలని సులేమాన్ నగర్, శాస్త్రీపురం డివిజన్ల ప్రజలు కోరుతున్నారు. ఆవారా యువకులపై కఠినంగా వ్యవహరించాలంటున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది రోజూ ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాలను తనిఖీ చేసేలా ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి


మంత్రికి వినతిపత్రాన్నిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో స్థలం కేటాయించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు కోరారు. ఈ మేరకు వారు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. మూడేళ్లుగా కళాశాల ప్రభుత్వ బాలుర పాఠశాల భవనంలో కొనసాగుతున్న కారణంగా నూతన భవనం నిర్మాణం అవసరముందని తెలిపారు. జూనియర్ కళాశాలలో అవసరమైన స్థలం ఉన్న కారణంగా దానిని కేటాయించాలన్నారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు వెంటనే ఇంటర్‌బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్యతో విషయాన్ని వివరించడంతో ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ పి.సంజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లు పెంచి ఇవ్వండి

మణికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వితంతువులు, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పెంచి ఇస్తామని వాగ్దానం చేసి రెండు సంవత్సరాలు గడచినా అమలు చేయలేదని, ఇకనైనా వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ గండిపేట మండల నాయకులు కోరారు. ఈ మేరకు నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డికు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి పి.గణేశ్ మాదిగ మాట్లాడుతూ... ఒంటరి మహిళలకు రూ. 2 వేల నుంచి రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు, కండరాల క్షీణత ఉన్న వారికి రూ. 15 వేలు పింఛన్ ఇస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి న్యాయం చేయాలని, లేదంటే రాబోయే రోజుల్లో దీక్షలు, లక్షలాది పింఛన్‌దారులతో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీపడం


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని.. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీఎన్‌జీవోస్ కాలనీలో రూ. 48 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పైపులైన్ పనులను, మధుబన్ కాలనీ, మధురనగర్‌లలో నిర్మిస్తున్న సీసీ రోడ్డులను పర్యవేక్షించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. నేతలు బుచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, చందునాయక్, రమేష్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి, తలారి చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, రాజేష్, అనిల్‌రెడ్డి, భవాని, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న డీసీపీ శ్రీనివాస్ తదితరులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

అత్తాపూర్: నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున 6 గంటలకు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్, ఇంద్రానగర్ ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మొత్తం 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. 12 సర్చ్ టీంలతోపాటు ఐదు ప్రధాన రహదారులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 16 వాహనాలు, నెంబర్ ప్లేట్స్ లేకుండా 35 నడుస్తున్న వాహనాలు, సరైన పత్రాలు లేని ఆరు ఆటోలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండు బెల్ట్ షాపులను సీజ్ చేశారు. రెండు హుక్కా సెంటర్లు, గ్యాస్ ఫిల్లింగ్ రీఫిల్ సెంటర్లపై దాడులు చేశారు. చెక్ పోస్టుల వద్ద వాహనాలను పరిశీలించి చలానాలు కట్టకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చలానాలను కట్టించారు. 475 మంది ఆధార్ కార్డులను పరిశీలించగా అందులో 27 మంది పక్క రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. ఆరుగురు రౌడీషీటర్ల ఇళ్లలోకి వెళ్లి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా వంటివి ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే డయల్ 100కు సంప్రదించాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీసీపీ స్పష్టం చేశారు. కార్డెన్ సెర్చ్‌లో అదనపు డీసీపీ ఏఎస్ రావు, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, క్యాస్ట్రో, నరేందర్, డీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ అధ్యక్షుడు

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారని బీజేపీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొండె మహేష్‌యాదవ్ అన్నారు. సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్, వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. సీనియర్ నాయకులు పి.ఎస్.మల్లారెడ్డి, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి పవన్‌సాయి, టి.గోపాల్‌గౌడ్, క్యాతం సందీప్‌యాదవ్, రవినాయక్, వెంకటాచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశ్రీహిల్స్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో ఐసీఏఆర్–ఎన్ఏఆర్ఎం సహకారంతో డాక్టర్ లక్ష్మణ్ అహిరే ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లను ఊడ్చడంతో పాటు చెత్తచెదారాల తొలగింపు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజలు తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే రోగాల దరి చేరకుండా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. డాక్టర్ లక్ష్మణ్ జీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్డి చిన్నారులకు చేయూతనిస్తాం


రెడ్డి విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఎంఆర్ఎఫ్ నాయకులు

మణికొండ: ఆర్థికంగా వెనుకబడి ఉన్న రెడ్డి కులస్తులతో పాటు వారి పిల్లలను తమ వంతుగా ప్రోత్సహిస్తామని ఆదిత్య హోమ్స్ నిర్మాణ సంస్థ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కాంటినెంటల్ ఆసుపత్రి ప్రతినిధి బాల్‌రెడ్డి అన్నారు. మణికొండ రెడ్డి ఫౌండేషన్ తరఫున శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న 30 మంది పేద విద్యార్థులకు వారి చదువుల గురించి రూ. 6.5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ... పేరుకు రెడ్డి కులంలో పుట్టినా ఎంతో మంది పేదలు ఉన్నారన్నారు. వారికి సహచర రెడ్డీలుగా తమ వంతు ఆదుకోవాల్సిన బాధ్యతను గుర్తించి మొదటి విడతగా 30 మంది విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించామన్నారు. ఇచ్చిన డబ్బును సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీపతిరెడ్డి, రమనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, రామిరెడ్డి, బాల్‌రెడ్డి, ఉత్తంకుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రామసుబ్బారెడ్డి, కిషన్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోతున్న రోడ్లు

అత్తాపూర్: భారీ వర్షాల కారణంగా మూసి పరీవాహక ప్రాంతం మీదుగా ఉన్న రోడ్డు మార్గం వరద ధాటికి లక్ష్మీనగర్ పార్కు సమీపంలో మూడు ప్రాంతాల్లో కోతకు గురైంది. భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లంగర్‌హౌస్ బాపూఘాట్ బ్రిడ్జి నుంచి మూసీ నది పరీవాహక ప్రాంతం నుంచి అత్తాపూర్ హనుమాన్ దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం మార్గంలో రోడ్డు కోతకు గురైంది. హైదర్‌గూడ, అత్తాపూర్, నలందానగర్, కొండల్‌రెడ్డి అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, కాంతారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో వరద నీరు పెద్ద ఎత్తున మూసీ నదిలోకి చేరుకుంటుంది. రోడ్డు కోతలకు గురైన ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



స్వచ్ఛతపై విద్యార్థినులకు అవగాహన


స్వచ్ఛతోత్సవ్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: ప్రతి ఒక్కరూ తాము ఉంటున్న ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారని నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్‌రెడ్డి ఆదేశాలతో నార్సింగి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించి, స్వచ్ఛతోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు దసరా సెలవులలో ఇంటికి వెళ్లాక ప్రతి ఒక్కరి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేయటం, దాన్ని గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి అందించేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవటం మనందరి బాధ్యత అన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 15 రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాజేంద్రనగర్ డివిజన్‌లోని రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం, పక్వాడ్ డివిజన్ కన్వీనర్ బండారి బాలకృష్ణ ఆధ్వర్యంలో యూత్ క్లబ్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను తమ వంతు బాధ్యతగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.బాబురావు, ఎస్.వాసు, హరికిషన్ జీ, వనితా రెడ్డి, రవీందర్, ఎస్.రాజశేఖర్ రెడ్డి, యు.పవన్, మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

అత్తాపూర్: దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను పాఠశాల చివరి పని దినమైన శనివారం మహిళా ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినుల సహకారంతో విద్యార్థినులు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు రజియాబేగం, సుజాత, రోజారాణి, జ్యోతి, హేమలత, అనిత, పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీనివాస సాగర్, రంగారెడ్డి, సురేష్, లింగారాజు, కమలమ్మ, కృష్ణవేణి, కవిత, సరిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


హైదర్‌గూడ పాఠశాలలో...

హైదర్‌గూడలో...

హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరించి బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసి సంబరాలు నిర్వహించారు.

ఖానాపూర్, మణికొండలో...

మణికొండ: మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నిరంజన్, సినీ నటి స్వాతి మాట్లాడుతూ... రాబోయే తరానికి పండగల విశిష్టతలను తెలియజేసేలా పాఠశాలల్లో అన్ని ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. మణికొండలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.కుమార్, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు దశరథ్‌నాయక్, శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఖానాపూర్‌లో ప్రిన్సిపాల్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోటిగూడ ప్రాథమిక పాఠశాలలో...

శంషాబాద్ రూరల్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా మండలంలోని బోటిగూడ ప్రాథమిక పాఠశాలలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఖానాపూర్‌లో...


మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...



బతుకమ్మలతో అత్తాపూర్ స్కూల్ ఉపాధ్యాయినులు


బోటిగూడలో బతుకమ్మలతో చిన్నారులు, ఉపాధ్యాయినులు